ప్రజాశక్తి
సోమవారం 9 జూన్ 2025

అరకు లోయలో భారీ వర్షం

అరకులోయలో కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి- అరకులోయ : పర్యాటక కేంద్రమైన అరకులోయ ప్రాంతంలో ఆదివారం పొద్దుపోయాక భారీ వర్షం కురిసింది. కొద్ది రోజులుగా మండుటెండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు ఉపశమనం కలిగింది. ఆదివారం కురిసిన వర్షంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. అయితే భారీ వర్షంతోపాటు పెద్ద శబ్దాలతో ఉరుములు, మెరుపులతోపాటు పిడుగులు పడడంతో ఈ ప్రాంతవాసులు భయాందోళన గురయ్యారు. కొన్నాళ్లుగా ఉదయం దట్టమైన మంచు, మధ్యాహ్నం ఎండ, సాయంత్రం మబ్బుల వాతావరణంతో మూడు కాలాలను తలపించినా, ఇపుడు వర్షం కురవడంతో వాతావరణం చల్లబడి ప్రజలు సేదదీరారు.

ప్రాణం తీసిన ఈత సరదా!

- చెరువులో స్నానానికి దిగి ముగ్గురు గిరి బాలల దుర్మరణం
- గంగవలసలో విషాదకర సంఘటన
- బిల్లపుట్టు, గంగవలస గ్రామాల్లో విషాదం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని గంగవలసలో తీవ్ర విషాదకరమైన సంఘటన చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం చెరువులో స్నానానికి వెళ్లి, ఈత సరదాతో నీటిలో దిగిన ముగ్గురు గిరి విద్యార్థులు బురద ఊబిలో చిక్కుకుని దుర్మరణం పాలయ్యారు. వేసవి సెలవుల్లో సరదాగా బంధువుల ఇంటికి వెళ్లిన ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారు. వీరి మరణంతో గంగవలస, బిల్లపుట్టు గ్రామాల్లో తీవ్ర విషాదం నెలకొంది. దీనికి సంబంధించి గ్రామస్తులతోపాటు బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాలివి.

గుంటసీమ పంచాయతీ కేంద్రానికి అనుకొని ఉన్న గంగవలసకు చెందిన కొర్ర సుశాంత్(14), పోతంగి పంచాయతీ బిల్లపుట్టు గ్రామానికి చెందిన గుంట భానుతేజ (14), గుంట సాయి కిరణ్(14) ముగ్గురు గిరిజన విద్యార్థులు ఆదివారం ఉదయం సరదాగా స్నానం చేయడానికి గ్రామానికి సమీపంలో గల చెరువుకు వెళ్లారు. ఈతసరదాతో చెరువులో దిగగా, నీరు లోతుగా ఉండడంతో పాటు బంకమట్టి ఊబి ఉండడంతో కూరుకుపోయి బయటికి రాలేక మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఒకేసారి రెండు గ్రామాల్లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతితో రెండు గ్రామాల్లో తీవ్ర విషాద యలు అలుముకున్నాయి. బిల్లపుట్టుకు చెందిన భానుతేజ్ నర్సీపట్నంలో 9వ తరగతి చదువుతుండగా, సాయి కిరణ్ అరకులోయ సిహెచ్ స్కూల్‌లో చదువుతున్నాడు. గంగవలసకు చెందిన సుశాంత్ గుంట సీమ ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. బిల్లపుట్టుకు చెందిన ఇద్దరు విద్యార్థులు వేసవి సెలవులు కావడంతో గంగవలసలోని వారి మేనమామ ఇంటికి చుట్టాలుగా వెళ్లారు. గ్రామంలోని భానుతేజ్ అనే విద్యార్థితో కలిసి సరదాగా స్నానానికై వెళ్లగా ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. విషయం గ్రామస్తులకు అందడంతో చెరువు లో వెళ్లి మృతదేహాలను బయటకు తీశారు. సరదాగా ఆడుతూ పాడుతూ ఉండాల్సిన చిన్నారులు చెరువులో మునిగి విగత జీవులుగా మారడంతో వారి తల్లిదండ్రులు, కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. అందిన సమాచారం మేరకు డిఎస్‌సి, పోలీస్ సిబ్బందితో గంగవలస గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబీకులను పరామర్శించారు. మృతదేహాలను పోస్టుమార్టానికి అరకులోయ ఏరియా హాస్పిటల్ కు తరలించారు.

పరిహారం చెల్లించి ఆదుకోండి : సిపిఎం

ఉపాధి హామీ పథకంలో నిర్మించిన చెరువులో స్నానానికి వెళ్లి దిగి ముగ్గురు గిరి విద్యార్థులు మృతి చెందిన నేపథ్యంలో బాధిత కుటుంబీకులకు ప్రభుత్వపరంగా పరిహారం చెల్లించి ఆదుకోవాలని సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు డిమాండ్ చేశారు. గిరి విద్యార్థుల ప్రమాదమరణం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబీకులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

ముంపుపై సమీక్షా సమావేశం నిర్వహించాలి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పులి సంతోష్‌కుమార్

పులి సంతోష్‌కుమార్

ప్రజాశక్తి - వి.ఆర్.పురం: రానున్న రెండు నెలల్లో పోలవరం ముంపు మండలాల్లో వరదలు వచ్చే పరిస్థితి నెలకొందని, ప్రజలు తీవ్ర సమస్యల్ని ఎదుర్కోవాల్సి వస్తుందని తక్షణమే అధికారులు సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేసి వరద బాధితులకు మనోధైర్యాన్ని కల్పించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పులి సంతోష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. ప్రతి ఏటా వరదలు రావడంతో ముంపు మండలాల ప్రజలు పంటలు కోల్పోయి, రవాణా లేక, విద్యుత్ సౌకర్యం లేక, తాగడానికి మంచినీళ్లు లేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. అదేవిధంగా విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని వాపోయారు. గతంలో వరదల కారణంగా పోయిన రోడ్లు ఇంకా వేయలేదని, విఆర్ పురం మండలం రేకపల్లి నుంచి పెద్దమటపల్లి మీదుగా కుందులూరు, తులసిపాక వరకూ గతంలో ఉన్న రోడ్డును ఇప్పటికీ పూర్తి చేయలేదని పేర్కొన్నారు. నిర్వాసితులకు పునరావాసం, నష్టపరిహారం ఎప్పటికీ పూర్తి చేస్తారో ఎవరికి తెలియని గందరగోళం సృష్టించారని, సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేసైనా నిర్వాసితులకు ఎలాంటి సహాయక చర్యలు తీసుకుంటారో తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సీలేరు నదిలో మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - మోతుగూడెం: మోతుగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో సీలేరు నదిలో శనివారం గల్లంతైన అభిలాష్ (16) మృతదేహాన్ని దారాలమ్మ ఆలయం వెనుక కనుగొన్నారు. మృతుడు దేవరపల్లి, కొవ్వూరు గ్రామానికి చెందిన అభిలాష్. సీలేరు నదీ ప్రవాహం ఉండుండి ఎక్కువవుతున్నందున సాధ్యమైనంతవరకూ నదిలో దిగడం, ఈత కొట్టడం చేయకూడదని పోలీసులు హెచ్చరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వైసిపి మండల అధ్యక్షునిగా రామకృష్ణ

రామకృష్ణ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: వైసిపి మండల అధ్యక్షులుగా సింగిరెడ్డి రామకృష్ణను నియమిస్తూ పార్టీ కార్యాలయం నుంచి శనివారం ఆదేశాలు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన సేవలను గుర్తించి పార్టీ మండల అధ్యక్షునిగా ఎంపికయ్యేందుకు కృషి చేసిన ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు సహకారంతో మండలంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. రామకృష్ణను ఎంపిపి గోము వెంకటలక్ష్మి, సర్పంచుల సమైక్య మండల అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేశ్వరరాజు, కోఆప్షన్ సభ్యులు అడపా కామేశ్వరరావు, వైస్ ఎంపిపిలు జుర్రా జానుబాబు రాజేశ్వరి, చప్పా సత్య చంద్రరాణి, పార్టీ నాయకులు బొడ్డు వెంకటరమణ, సింగిరెడ్డి రవి, ఎంపిటిసిలు కనిగిరి గంగాదుర్గా అభినందనలు తెలిపారు.

కల్యాణగుమ్మిలో ప్రత్యామ్నాయ పాఠశాల ఏర్పాటు చేయరూ!

కడరేవు వద్ద గిరిజనుల ఆందోళన

కడరేవు వద్ద ఆందోళన చేస్తున్న కల్యాణగుమ్మి గిరిజనులు

ప్రజాశక్తి- అనంతగిరి : మండలంలోని కల్యాణగుమ్మిలో ప్రత్యామ్నాయ పాఠశాల ఏర్పాటు చేయాలని గిరిజన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆదివారం కడరేవు గ్రామం వద్ద ఆందోళన చేపట్టారు. అందుబాటులో పాఠశాల లేక తమ బిడ్డలు చదువుకు దూరమైపోతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలకు గెడ్డలు దాట, కొండల చుట్టూ తిరిగి పాఠశాలలకు కిలోమీటర్ల దూరం వెళ్ళవలసి వస్తుందని తక్షణమే పాఠశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్ రామారావు. మాట్లాడుతూ గత ఏడాది పాఠశాల ఏర్పాటు చేయాలని మండల విద్యాశాఖ అధికారికి విన్నవించినప్పటికీ ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విద్యా సంవత్సరంలోనైనా పాఠశాల ఏర్పాటు చేయాలని వారు డిమాండ్స్ చేశారు. గ్రామంలో 12 మంది బడిఈడు పిల్లలు ప్రస్తుత మున్నారని, వారంతా పిన్నకోట పంచాయతీ పరిధి మదన గరువు. సొల్లుబొంగు పాఠశాలలకు కాలినడకన వెళ్లాల్సి వస్తోందన్నారు. మార్గమధ్యలో రైవాడ, గోస్తని గెడ్డ దాటి వెళ్లాల్సిన పరిస్థితుల్లో వర్షాలు కురిస్తే ఉధృతంగా ప్రవహించే ఆయా గెడ్డలను నాటుపడవలో దాటి వెళ్లడం ప్రాణప్రమాదమేనని ఆందోళన చెందుతున్నారు. పాఠశాలకు వెళ్లే క్రమంలో రానుపోను నాలుగు కిలోమీటర్ల దూరం రైవాడ జలాశయం మీదుగా బోటు సహాయంతో అనకాపల్లి జిల్లా దేవరపల్లి మండలం తామరభ ఎంపిపి పాఠశాలకు వెళ్తున్నారని, అలాగే గుమ్మ. పిన్నకోట .పంచాయతీల పరిధి కడరేవు, .కొట్టంగుడ, గొప్పల పాలెం, అనకాపల్లి జిల్లా దేవరపల్లి మండలం మోడుగరువు పాఠశాలకు రానుపోను ఏడు కిలోమీటర్ల దూరాన్ని ఉప్పొంగిన గెడ్డలు కొండ కోనలు దాటి వెళ్లిరావడం ఇబ్బందికరంగా ఉందన్నారు. తమ పిల్లలను చదువుకు దూరం చేయొద్దని,తక్షణం తమ గ్రామంలో పాఠశాలను ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నారు. అధికారులు స్పందించకుంటే ఐటిడిఎ , జిల్లా పరిషత్‌లను ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నారు.

అంతేకాకుండా తమ గ్రామాలకు కనీస రోడ్డు సౌకర్యాలు లేకపోవడంతో చదువుతోపాటు అత్యవసర అనారోగ్య సమయంలో ప్రాణాల మీదకు వస్తోందని వాపోతున్నారు. అటవీశాఖ అభ్యంతరాలతో నిలిచిపోయిన రోడ్డు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు

రైవాడ జలాశయంలో నాటుపడవలో పాఠశాలకు వెళుతున్న గిరిబాలలు (ఫైల్ ఫోటో)

జైకిసాన్‌ను అభినందిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్ తదితరులు

ఆదివాసీ విద్యార్థికి అభినందనలు

ప్రజాశక్తి- రాజవొమ్మంగి : ఇటీవల విడుదలైన జెఇఇ అడ్వాన్స్ 2025 పరీక్షా ఫలితాల్లో 125వ ర్యాంక్‌తో సత్తా చాటిన ఆదివాసీ విద్యార్థి కింటుకూరి జైకిసాన్‌కు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ఆదివాసి సంఘాల నాయకుల నుండి అభినందనలు వెల్లువెత్తాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా వైరామవరం మండలంకోట గ్రామానికి చెందిన కింటుకూరి లక్ష్మణరావు కుమారుడు ఈ విజయాన్ని సాధించి జాతీయస్థాయిలోనే ప్రముఖ ఐఐటీలలో ప్రవేశం కొరకు అర్హత సాధించాడు. జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం ఆదివారం అతనిని అభినందించారు.

అనుచిత వ్యాఖ్యలపై ఫిర్యాదు

పాడేరులో సిఐకి ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: సాక్షి ఛానెల్ నిర్వహించే లైవ్ విత్ కెఎస్ఆర్ కార్యక్రమంలో రాష్ట్ర రాజధాని అమరావతిపైనా, రాజధాని నిర్మాణం కోసం భూములిచ్చిన మహిళలపై జర్నలిస్టు వివిఆర్ కృష్ణంరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలు బాధాకరమని, ఇటువంటి వివాదాస్పద కామెంట్లు చేసిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు చేపట్టాలని తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయరాణి అన్నారు. అనుచిత వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆదివారం పాడేరు పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు తెలుగు మహిళలు ఫిర్యాదు చేశారు. రాజధాని మహిళలపై దుర్మార్గపు వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టు కృష్ణంరాజుపైన, కార్యక్రమాన్ని నిర్వహించిన కొమ్మినేని శ్రీనివాసరావుపైన, సాక్షి యాజమాన్యంపైనా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

అమరావతిని వేశ్యల రాజధానిగా, ఎయిడ్స్ రోగుల కేంద్రంగా జర్నలిస్టు కృష్ణంరాజు వ్యాఖ్యలు చేయడం,వాటిని కార్యక్రమనిర్వాహకుడు కె.శ్రీనివాసరావు సమర్థించడానికి తీవ్రస్థాయిలో ఖండించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమరావతిని 'దేవతల రాజధాని'గా అభివర్ణిస్తూ చేసిన ప్రకటనను ప్రస్తావిస్తూ కష్ణంరాజు చేసిన ఈ వ్యాఖ్యలను రాష్ట్రంలో ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన వారిలోఎంపిపి రత్నకుమారి, సర్పంచ్‌లు లకే పార్వతమ్మ, డుంబేరి శ్రీలక్ష్మి, అరకు పార్లమెంట్ తెలుగు మహిళ ఎస్‌టి సెల్ అధికార ప్రతినిధి డిప్పల కుమారి, అరకు పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు గబ్బడి కుమారి, గూడెం ఎంపిటిసి పసుపులేటి నాగమణి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బొడ్డేటి వరలక్ష్మి ఉన్నారు.

మహిళలను అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి

చింతూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న మహిళలు

దేవీపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి - చింతూరు : మహిళలను దారుణంగా అవమానిస్తూ సాక్షి మీడియాలో కొమ్మినేని, కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా చింతూరు పోలీస్‌స్టేషన్‌లో తెలుగు మహిళలు ఫిర్యాదు చేశారు. కొమ్మినేని, కృష్ణంరాజులపై కేసు నమోదు చేసి జైలుకు పంపించాలని, తక్షణమే మహిళా లోకానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు కారం సత్యవతి, కారం అచ్చమ్మ తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

రాజవొమ్మంగి : సాక్షి ఛానల్‌లో అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టులు కృష్ణంరాజు, శ్రీనివాసులుపై కేసు నమోదు చేయాలని రంపచోడవరం జనసేన పార్టీ మహిళ నాయకులు పాతర సీతామహాలక్ష్మి ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

దేవిపట్నం : సాక్షి ఛానల్‌లో రాజధాని గురించి, అమరావతి మహిళల గురించి అసభ్యకరంగా మాట్లాడిన కృష్ణంరాజు మీద కఠినమైన చర్యలు తీసుకోవాలని టిడిపి మండల అధ్యక్షులు మరిశెట్ల వెంకటేశ్వర ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు మాగపు బాబురావు, సర్పంచ్ కుంజం రాజమణి, మాజీ ఎంపిటిసి ముచ్చు వీరవెంకట సత్యనారాయణ, చవళం శివరామకృష్ణ, మద్దేటి అంజిరెడ్డి, రేలంగి రాంబాబు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రోగులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

400 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - రంపచోడవరం : రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్య శాల రాజమండ్రి వారి అధ్వర్యంలో రంపచోడవరం, సిరిగిందలపాడులో ఆదివారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించినట్లు రామకృష్ణమిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలియచేశారు. వైద్యశిబిరంలో రామకృష్ణ మిషన్, స్వామి ప్రజ్ఞనాదనంద మహారాజ్, స్వామి లోకమయనంద మహారాజ్ పాల్గొని వైద్యశిబిరం సేవలను పర్యవేక్షించారు. సుమారు 400మందికి వైద్య సేవలు అందించినట్లు స్వామీజీ తెలిపారు. రాజమహేంద్రవరం సివిల్ జడ్జి టి.వి.రాఘవేంద్రరావు, డాక్టర్ జి.వి.రామారావు, డాక్టర్ కస్తూరి సుబ్రహ్మణ్యం, డాక్టర్ టి.వి.సుబ్బారావు, డాక్టర్ దాసరి ఉమామహేష్, డాక్టర్ ఎస్.సంపత్ కుమార్, జి.యస్.ఎల్.డాక్టర్స్, క్యాంప్ కో - ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వాలంటీర్స్ పాల్గొన్నారు, రోగులకు, సహాయకులకు అన్నదానం నిర్వహించినట్టు స్వామీజీ తెలిపారు.

వయో వృద్ధులతో యోగా

పాడేరులో యోగా చేస్తున్న వయోవృద్ధులు

ప్రజాశక్తి -పాడేరు: ముఖమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు, యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఉన్నతాధికారులు, అల్లూరి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆదేశాలతో ఆదివారం 75ఏళ్ల పైబడిన వృద్ధులు, సీనియర్ సిటిజన్స్‌తో యోగా కార్యక్రమం నిర్వహించారు. అల్లూరి జిల్లాలోని పాడేరు, రంపచోడవరం, చింతూరు మూడు ప్రాంతాల్లో యోగ సాధన చేశారు.

నేడు విశాఖకు నారా లోకేష్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ సోమవారం విశాఖ వస్తున్నారు. రెండు రోజుల పాటు పార్వతీపురం మన్యం, విశాఖపట్నం జిల్లాల్లో పర్యటించనున్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖపట్నం చేరుకొని అక్కడ నుంచి11 గంటలకు పార్వతీపురం పట్టణంలోని రాయల్ కన్వెన్షన్‌కు చేరుకుంటారు. 11 గంటల నుంచి 1.30 గంటల వరకు రాయల్ కన్వెన్షన్‌లో జరిగే 'షైనింగ్ స్టార్స్ అవార్డ్' కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు పార్వతీపురం మండలం చిన్న బొందపల్లిలో ఉత్తమ కార్యకర్తలు, నియోజకవర్గ సమన్వయ సమావేశంలో పాల్గొంటారు. మంగళవారం ఉదయం 10 గంటలకు విశాఖపట్నం చేరుకుని 10.45కు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఇంటిని సందర్శించనున్నారు. 11 నుంచి మధ్యాహ్నం 1 వరకు విశాఖ కలెక్టరేట్ లో యోగాంధ్ర కార్యక్రమంపై నిర్వహించే సమీక్షలో పాల్గొంటారని అధికారిక ప్రకటన వెలువడింది.

చేపలు పడుతున్న రైతులు

చేపల వేటలో రైతులు బిజీ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మృగశిర కార్తె నేపథ్యంలో రైతులు చేపలు వేటలో బిజీ అయ్యారు. గెంజర్తి, రాజవొమ్మంగి, జడ్డంగి, అప్పలరాజుపేట, తదితర రిజర్వాయర్లు, చెరువుల్లో ఆదివారం రైతులు చేపలు పట్టారు. కిలో రూ.120 నుండి రూ.150 వరకు విక్రయించారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

- విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 21న జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతిఒక్క అధికారి పూర్తి బాధ్యతతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ పిలుపు నిచ్చారు. ఆదివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్యక్రమానికి సుమారు 5 లక్షల మంది ప్రజలు పాల్గొననుండగా, ఆర్‌కెబీచ్ కాళీమాత టెంపుల్ నుంచి భీమిలి బీచ్ వరకు, విభిన్న స్టేడియాలలో యోగా ప్రదర్శనలు నిర్వహించనున్నారన్నారు. ప్రజలను బస్సుల ద్వారా కంపార్ట్మెంట్ ప్రాంతాలకు చేర్చిన తర్వాత బస్సులను పార్కింగ్ ప్రదేశాలకు తరలించాలన్నారు. విద్యుత్, పార్కింగ్,రవాణా,వైద్యం తదితర అంశాల్లో ముందస్తు ఏర్పాట్లపై దష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల నుంచి ప్రజలు భారీగా హాజరు కానున్నారని బస్సులను సిద్ధంగా ఉంచాలని ఆర్టిసి అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్, విఎంఆర్డిఎ కమిషనర్ కె.ఎస్ విశ్వనాథన్, డిఆర్ఓ భవానీశంకర్, ఆర్‌డిఓలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్

విరాళం అందిస్తున్న జమాల్‌ఖాన్ ట్రస్టు సభ్యులు

దళిత మహిళ అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చింతూరు : మండలంలోని చిడుమూరు పంచాయతీ పరిధిలోని నరసింహపురం గ్రామానికి చెందిన గంట్ల కాంతమ్మ అనే దళిత మహిళ అనారోగ్య కారణంతో శనివారం మృతి చెందింది. అంత్యక్రియలకు సంబంధించి మహిళ కుటుంబానికి ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జెకె సిటీ ట్రస్ట్ చైర్మన్ మొహమ్మద్ జమాల్ ఖాన్ ట్రస్టుద్వారా రూ.5వేలు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఎస్కే షాజహాన్, ఎస్‌కే రియాజ్ దళిత నాయకులు మెల్లం నాగేంద్ర, పట్రా కిరణ్ పట్రా రమేష్ , శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అనునిత్యం యాతనే!

కొట్టుకుపోయిన జంగం పుట్టు రహదారి

- అధ్వానరోడ్లతో మన్యవాసుల అవస్థలు!
- అత్యవసర, నిత్యవసర సమయాల్లో అగచాట్లు
- ఇళ్లు మంజూరైనా నిర్మించుకోలేని దుస్థితి
- చెప్పనలవికాని గత్తుం, పట్టం గిరిజనుల పాట్లు

కుమ్మరి పుట్టు గ్రామ సమీపంలో కోతకు గురైన మెటల్ రహదారి

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని గత్తుం, పట్టం పంచాయతీల్లో అధ్వానపు రహదారులతో మన్యవాసులు అవస్థలు పడుతున్నారు. ఏళ్ల తరబడి నిర్వహణ, పునర్నిర్మాణం, శాశ్వత ప్రాతిపదికన పటిష్టపరిచే చర్యలు చేపట్టకపోవడంతో నేటికీ మట్టిరోడ్లులనే దర్శనమిస్తున్నాయి. వర్షాకాలంలో మట్టి కోతకు గురై, మెటల్ చెదిరిపోయి, రాకపోకలకు వీలులేనంత నరకప్రాయంగా మారుతోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అత్యవసరంతోపాటు నిత్యవసరాలకు ఇలా ప్రతినిత్యందానికి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితుల్లో కనీసం రూపులేని రోడ్లులేనా యాతన పడుతున్నామని స్థానిక గిరిజనులు వాపోతున్నారు. అటవీ, గిరిజన ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లిఅమ్ముకునేందుకు వీరు పడుతున్న ఇబ్బందులు చెప్పనలవికాదు.

మండలంలోని గుత్తుం పంచాయతీ జంక్షన్ నుండి దుర్గం, జంగంపుట్టు, డాలింపుట్టు, వెలగపాడు కరకవలస ఐదు గ్రామాలలో రహదారి సౌకర్యం లేకపోవడంతో ఆయా గ్రామాలకు చెందిన 670 మంది గిరిజనులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు బొడ్డపుట్టు వరకు .కొండప్రాంతం కావడంతో రేషన్ సరుకులు తెచ్చుకోవడానికి రాకపోకలకు రోడ్డుమార్గం లేక, కాలినడకన సైతం వెళ్లేందుకు వీలు లేని స్థితి ఉందని వాపోతున్నారు. వర్షాలకు ఉన్న మట్టిరోడ్డు కాస్తా కోతకు గురైందని అంటున్నారు. గతంలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా, అరకొరగా పనులు చేసి వదిలేయడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని ఆవేదన చెందుతున్నారు. దీనిపై 2022లోనే ఐటిడిఎ స్పందించాలని ఫిర్యాదు చేయడంతోపాటు సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నా ఫలితం లేకుండా పోయిందని ఆందోళన చెందుతున్నారు. సిపిఎం, ప్రజాసంఘాల పోరాటాలతో నిధులు మంజూరైనా, టెండర్లు ఖరారు కాక పనులు జరగడం లేదని అంటున్నారు.

అలాగే పట్టం పంచాయతీ కుమార్‌పుట్టు, గంగుడి, పనసపుట్టు, బూరువరస, అమసగెడ తదితర ఐదు గ్రామాలకు 750 మంది గిరిజనులదీ మరోరకమైన కష్టం. పదేళ్ల క్రితం నాసిరకంగా వేసిన మెటల్ రోడ్డు వీరికి నరకం చూపిస్తోంది. నిర్మాణసమయంలో నాణ్యతాలోపం, తర్వాత దాన్ని పటిష్టపరిచే చర్యలు చేపట్టకపోవడంతో రోడ్డుపై మెటల్ తేలి, చెదిరిపోయి రాళ్లు పెట్టలేని విధంగా తయారైంది. ఇక బైకులు, ఇతర వాహనాలు వెళితే స్కిడ్ అయి ప్రమాదానికి గురికావడం భయమయ్యే పరిస్థితి ఉంది. మెటల్ రోడ్డు నిర్మాణం తర్వాత తారురోడ్డు వేయాలని నాటి నుంచి నేటి వరకు ఐదు గ్రామాల ప్రజలు ఐటిడిఎ, ఇతర కార్యాలయాల చుట్టూ ఎన్నిసార్లు ప్రదక్షిణలు చేసి, మొరపెట్టుకున్నా అది అరణ్యరోదనగానే మిగిలిపోయిందని తప్ప, ఇసుమంతైనా ప్రయోజనం లేదని ఆవేదన చెందుతున్నారు.

మెటల్‌రోడ్డుతో పడుతున్న అవస్థలను భరించలేక, అధికారులకు మొరపెట్టుకున్నా కదలిక లేకపోవడంతో గిరిజనులే స్వచ్ఛందంగా ముందుకొచ్చి, కోతకు గురైన మెటల్‌రోడ్డుపై మట్టివేసి తాత్కాలిక ఉపశమన చర్యలు చేపట్టిన, వర్షం కురిసిన వెంటనే మళ్లీ మొదటికొస్తోందని వాపోతున్నారు. ప్రస్తుతం పిఎం జన్‌మన్ కింద ఇళ్లు మంజూరైనా, భవన నిర్మాణ సామగ్రి తరలింపుకు వీలులేక నిర్మాణాలు చేయలేకపోతున్నామని ఆదివాసీలు ఆవేదన చెందుతున్నారు.

ఇళ్లు మంజూరైనా...

గుత్తుం పంచాయతీలోని ఐదు గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక పిఎం జన్‌మన్ ఇళ్లు మంజూరైనా కట్టుకోలేని పరిస్థితి. నిర్మాణ సామాగ్రి తెచ్చుకునేందుకు వీలులేని స్థితి. అధిక ఛార్జీలు ఇస్తామన్నా వాహనదారులు ముందుకు రావడంలేదు.

శోభ సుందరరావు, గ్రామపెద్ద, జంగంపుట్టు, గుత్తుం పంచాయతీ

కాలినడకన వెళ్లేందుకూ కష్టమే

మెటల్ వేసి వదిలేయడంతో రోడ్డంతా రాకపోకలకు వీలులేని స్థితి. ఇళ్ల నిర్మాణసామగ్రి తేవాలంటే అధిక రవాణాఛార్జీలు డిమాండ్ చేస్తున్నారు. వర్షాలకు రోడ్డుకోతకు గురికావడంతో కాలినడకన వెళ్లేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నాం.

దుంబేరి బాలన్న, గంగుడి గ్రామం, పట్టం పంచాయతీ

నేరాలు ఘోరాలు

పోక్సో కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-భీమునిపట్నం : స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో 14 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం..పాఠశాలలకు సెలవు దినాలు కావడంతో విజయనగరానికి చెందిన 14 ఏళ్ల బాలిక భీమిలిలో అమ్మమ్మ ఇంటికి వచ్చింది. ఓ మహిళ మాయమాటలు చెప్పి బాలికను చేపల తిమ్మాపురంలో ఉన్న నూకరాజు ఇంటికి శనివారం తీసుకువెళ్లింది. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో బాలికపై నూకరాజు అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నూకరాజుతో పాటు అందుకు సహకరించిన మహిళపై పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం కెజిహెచ్‌కు తీసుకెళ్లారు.

కారు దగ్ధం

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలంలోని శొంఠ్యాం గ్రామంలో ఓ కారులో శనివారం రాత్రి మంటలు చెలరేగి దగ్ధమైంది. దీనిపై కారు యజమాని బొడ్డపు శ్రీనివాసరావు ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహేంద్రా ఎక్స్ యు వి 500 కారును శ్రీనివాసరావు తన స్థలంలో పార్క్ చేసి ఉంచారు. శనివారం రాత్రి11:30 గంటల సమయంలో కారు నుంచి మంటలు వ్యాపిస్తున్న స్థానికులు శ్రీనివాసరావుకు తెలియజేశారు. ఆయన వెంటనే అక్కడకు చేరుకున్నారు. కారు పూర్తిగా మంటల్లో చిక్కుకుంది. వెంటనే ఆయన పోలీస్ హెల్ప్ లైన్ 112, ఫైర్ హెల్ప్ లైన్ 101కు సమాచారం అందించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. సిఐ వాసునాయుడు ఆధ్వర్యాన ఎస్ఐ సంతోష్ కేసు నమోదు చేశారు.

చింతపల్లి ఆర్‌టిసి బస్ కాంపెక్స్

అసౌకర్యాల ఆర్‌టిసి కాంప్లెక్స్

అవస్థలు పడుతున్న అంతర్రాష్ట్ర ప్రయాణికులు

ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టని అధికారులు

ప్రజాశక్తి-చింతపల్లి: అంతరరాష్ట్ర బస్సుల రాకపోకలుసాగించే చింతపల్లిలోని ఆర్‌టిసి బస్‌కాంప్లెక్స్ మౌలిక సదుపాయాల కొరత, సమస్యలతో సతమతమౌతూ, నిత్యం ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తోంది. పెదవలస, కేడి పేట, నర్సీపట్నం, కొయ్యూరు, రంపచోడవరం, సీలేరు, లంబసింగి, జిమాడుగుల, పాడేరు, అరకూ వ్యాలీ వంటి ప్రాంతాలకు రోజువారీగా బస్సులు నడుస్తున్నా...బస్సు స్టాండ్‌లో కనీస వసతులు లేవు. ఆర్‌టిసి అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రతిబింబిస్తూ, ఇక్కడ ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన బెంచీలు పూర్తిగా శిధిలావస్థకు చేరుకున్నాయి. మరుగుదొడ్లు ఏనాడో మూలకు చేరిపోవడంతో మహిళా ప్రయాణికులు అవస్థలు పడేదుస్థితి. మౌలిక వసతుల లేమితో ప్రయాణికులు గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితులున్నాయి. ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసి టివి మూలకు చేరిపోయింది. బస్సు కోసం వేచిచూసే ప్రయాణికులకు వినోదం కల్పిస్తుందంటే అదీ పనిచేయకపోవడాన్ని చూసి జనం విస్తుపోతున్నారు. .

చింతపల్లి నుంచి ఒడిశా సరిహద్దు ప్రాంతాలకు వెళ్లే బస్సుల రాకపోకల నేపథ్యంలో ఈ బస్ స్టాండ్ ప్రాధాన్యత మరింత పెరిగింది.ప్రతిరోజూ వేల మంది ప్రయాణికులు ఇక్కడ నుంచి ప్రయాణిస్తున్నారు. ఇక్కడ సౌకర్యాలను మెరుగుపరచకపోయినా, కనీసం ఉన్నవాటిని బాగుచేయడం, శుభ్రతపై దృష్టి పెట్టకపోవడం దుర్మార్గమని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌టిసి అధికారులు స్పందించి, మరుగుదొడ్ల మరమ్మతులు, కొత్త బెంచీల ఏర్పాటు, సమాచార వ్యవస్థ పునరుద్ధరణ వంటి చర్యలు తీసుకొని బస్సు స్టాండ్‌ను ప్రయాణికులకు అనుకూలంగా తీర్చిదిద్ది, మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు. ఇతర రాష్ట్రాల ప్రయాణికుల వద్ద ఆంధ్రా పరువు తీయొద్దని వేడుకుంటున్నారు.

ఆకట్టుకున్న జానపద కళాసంబరాలు

ప్రజాశక్తి - ఆరిలోవ

ఉత్తరాంధ్ర నవచైతన్య కళా నాట్య సంఘం 22వ వార్షికోత్సవాన్ని ఆరిలోవలో ఆదివారం నిర్వహించారు. దీనిలో భాగంగా నిర్వహించిన జానపద కళా సంబరాలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం నిర్వహించిన కార్యక్రమానికి నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, కళన్ని నమ్ముకోవాలని, ప్రజల్ని చైతన్య పరిచే కళతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. అనంతరం అతిథుల ద్వారా కళా బృందాల గురువులకు సన్మానించారు. జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందించారు. మహిళా కోలాటం పోటీల్లో గెలుపొదిన విజేతలకు బహుమతులు అందజేశారు. నవచైతన్య కళా నాట్యం సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షులు పిల్లి వీర్రాజు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో వార్డు కార్పొటేటర్ కెల్ల సునీతసత్యనారాయణ, వార్డు టిడిపి అధ్యక్షులు పొత్రకండ ధర్మారావు, సంఘం నాయకులు చిన్నారెడ్డి, కొణతాల రాజు, మేడా మస్తాన్‌రెడ్డి, పిల్లి చిలకమ్మ, అట్టాడ లక్ష్మీనాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

పుల్ల మామిడిలో నీటి కష్టాలకు చెక్

పైపులైన్ ఏర్పాటుకు గ్రామపంచాయతీ, అధికారుల చర్యలు

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని చౌడుపల్లి పంచాయతీ పుల్లమామిడి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇటీవల గుర్తుతెలియని వ్యక్తి గ్రామంలోని తాగునీటి బావిలో కుక్కను చంపి పడవేయడంతో గ్రామస్తులు నీరు వాడలేని దుస్థితి ఏర్పడింది. ఈ ఘటనను దష్టిలో ఉంచుకుని, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్ గడుతూరి స్వర్ణలత, చౌడుపల్లి సర్పంచ్ లలిత గ్రామాన్ని సందర్శించి బావిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నీటి ట్యాంకుల ద్వారా కొన్నాళ్లుగా మంచినీటి సరఫరా చేపట్టామని, త్వరలోనే పెండ్లిమామిడి గ్రామం నుంచి ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేసి శుద్ధజలాన్ని తరలించే ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. బావినీరు తాగి కొంతమంది అస్వస్థతకు గురవడంతో, ఎఎన్ఎం సరమండ ప్రవల్లిక ఆధ్వర్యంలో గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

బావిని పరిశీలిస్తున్న సర్పంచ్ లలిత, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ స్వర్ణలత

'డెక్' భవనాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్

'డెక్' భవనం పనులు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విఎంఆర్డిఎ నిర్మిస్తున్న ప్రతిష్టాత్మక భవన సముదాయం 'డెక్' భవనాన్ని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ ఆదివారం విఎంఆర్డిఎ కమిషనర్ విశ్వనాథన్‌తో కలిసి పరిశీలించారు. త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్న ఈ భవనానికి సంబంధించిన అన్ని పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భవనం బాహ్యంగా ఆకర్షణీయంగా ఉండేలా అంతర్భాగంలో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన తేదీ ఖరారు అయ్యే నాటికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి భవనాన్ని ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ తెలిపారు. భవనం లోపల చిన్నపాటి లోపాలను సైతం గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విఎంఆర్డిఎ ఇంజినీరింగ్ అధికారులు , ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నేడు పిజిఆర్ఎస్ రద్దు

ప్రజాశక్తి , ఎంవిపి కాలనీ: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విశాఖపట్నం జిల్లాలో సోమవారం నిర్వహించాల్సిన షైనింగ్‌స్టార్ అవార్డు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, వివిధ జిల్లాల ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొనాల్సి ఉన్నందున సోమవారం 9వ తేదీన జరగాల్సిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేయబడిందని జిల్లా కలెక్టర్ కార్యాలయ అధికారులు తెలిపారు. అదేవిధంగా విఎంఆర్డిఎలో ఈ నెల 21న జరగుతున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఏర్పాట్లలో అధికారులంతా నిమగ్నమై ఉన్నందున కూడా రద్దు చేస్తున్నట్టు మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

కెజిహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ వాణి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయినిగా పేరుగాంచిన కెజిహెచ్ సూపరింటెండెంట్‌గా సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఐ.వాణి నియమితులయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఎంటి.కృష్ణబాబు నుంచి ఆదివారం ఉత్తరులు వెలువడ్డాయి. డాక్టర్ ఐ.వాణి ఆంధ్ర మెడికల్ కళాశాలలో సీనియర్ ప్రొఫెసర్‌గా ఉన్నారు. 15 రోజులలోగా ఆమె కొత్త బాధ్యతలు చేపట్టనున్నారు. ఇంతవరకు కెజిహెచ్ సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ పి.శివానంద అడిషనల్ ఛార్జి హోదాలో కొనసాగుతూ వచ్చారు. ఆయన కెజిహెచ్ ఆర్థోపెడిక్ సీనియర్ వైద్యులు.

ఎవికె ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మజ్జిగ పంపిణీ మూడోరోజు ఆదివారం కొనసాగింది. మజ్జిగ కేంద్రాన్ని అల్లూరి విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ సెక్రటరీ డాక్టర్ బి.గంగారావు, కోశాధికారి వి.ఎస్ పద్మనాభరాజు ప్రారంభించి, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల కమిటి ఇన్‌చార్జి జి.ఎస్.రాజేశ్వరరావు మాట్లాడుతూ ఈ కేంద్రం ఉదయం 11 నుండి మధ్యాహ్నం వరకూ ప్రతిరోజూ నిర్వహిస్తామని, వర్షాకాలం మొదలయ్యేవరకూ కొనసాగిస్తామని తెలిపారు. విజ్ఞాన కేంద్రం ఇప్పటికే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా కంప్యూటర్ శిక్షణ, ప్రతిరోజూ ఉచిత మెడికల్ చెకప్, ప్రతీ మూడో మంగళవారం మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని, మరికొద్ది రోజుల్లో టైలరింగ్ శిక్షణ కేంద్రం కూడా ప్రారంభిస్తున్నామని తెలిపారు. విజ్ఞాన కేంద్రం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ ఎం.సూర్యమణి తమతల్లి జ్ఞాపకార్థం రూ.5 వేలు, పోర్ట్ నాయకులు స్వతంత్రకుమార్, గంటా పద్మావతి ఎస్.వి.ఎస్. ఎ.ఎల్ శర్మ చెరొక వెయ్యి రూపాయలు చొప్పున విజ్ఞాన కేంద్రానికి విరాళంగా ఇచ్చారు. ఈరోజు మజ్జిగ పంపిణీలో ఎం.ఉమతో బాటు విద్యార్థి నాయకులు అజయ్ (చింటూ), కుసుమ, అంజలి, నరేష్, సంజయ్, భరత్‌సాయి తదితరులు పాల్గొన్నారు. అల్లూరి కార్యక్రమాల కమిటి సభ్యులు బుజ్జి,సి. హెచ్.సత్యనారాయణ, వై. రాజు నాయకత్వం వహించారు.

ఎంఎస్‌ఎంఇ పార్కులకు బాలారిష్టాలు

ఎపిఐఐసి భూముల గుర్తింపు
లేని చోట స్థల సమస్య
నిధులు కేటాయించని ప్రభుత్వం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి: జిల్లాలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఇ) పార్కుల అభివృద్ధి ప్రతిపాదనల దశలోనే ఉంది. బాలరిష్టాలు వెంటాడుతున్నాయి. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలనుకున్న పార్కులకు అనువైన స్థల అన్వేషణ ఎప్పటి నుంచో సాగుతోంది. ఉన్న కొద్దిపాటి ప్రభుత్వ స్థలాలను కావాల్సిన వారికి కట్టబెట్టడం, వ్యవసాయేతర కార్యక్రమాలకు వినియోగిస్తున్న భూమికి పరిహారం చెల్లించి సేకరించడానికి సర్కారు ముందుకురాకపోవడంతో ఎంఎస్‌ఎంఇల ఏర్పాటు మాటలకే పరిమితమవుతున్నాయి. కొత్తగా స్థలాలను గుర్తించే పనిచేయకుండా ఎపి పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి)కి చెందిన భూముల్లో ఎంఎస్‌ఎంఇ పార్కుల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. తనచేతిలోని పైసా ఖర్చుపెట్టకుండా ఎపిఐఐసి భూములు, డబ్బులతో అభివృద్ధి చేసిన అనువైన స్థలాలను పార్కుల కింద ప్రభుత్వం ప్రకటిస్తోంది. అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ఎంఎస్‌ఎంఇ పార్కును అభివృద్ధి చేయాలని గత బుధవారం జరిగిన మంత్రివర్గం ఆమోదించిన విషయం తెలిసిందే. కానీ ఎంఎస్‌ఎంఇ పార్కుల అభివృద్ధికి ప్రభుత్వ స్థలాల గుర్తింపు, లేనిచోట భూ సేకరణ, నిధులు కేటాయింపు అంశాలేవీ ప్రభుత్వం ప్రకటించలేదు. ఎంఎస్‌ఎంఇల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో ప్రభుత్వ ఆలోచన కార్యరూపం దాల్చే అవకాశం లేదు. కోడూరులో ఎపిఐఐసి అభివృద్ధి చేసిన ఎంఎంఎస్ఇ పార్కును ఈ నెల 6న అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కలెక్టర్ విజయకృష్ణన్ హడావిడిగా ప్రారంభించారు. నిధులు కేటాయించకుండా ఎపిఐఐసి అభివృద్ధి చేసిన స్థలాల్లో ఎంఎస్‌ఎంఇ పార్కులను అభివృద్ధి చేయాలనే యోచనలో ప్రభుత్వం వుంది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో గుర్తించిన ఎంఎస్‌ఎంఇ పార్కుల్లో అత్యధికం ఎపిఐఐసి స్థలాలే వున్నాయి. అనకాపల్లి నియోజకర్గం పరిధిలోని కోడూరులో తాజాగా ఒక పార్కు ప్రారంభించగా, ఇంకా మిగిలిన నియోజకవర్గాల్లో వీలైనంత తొందరగా ప్రారంభించాలని ఎమ్మెల్యేలు భావిస్తున్నా అందుకు స్థలాలు సిద్ధంగా లేవు. పెందుర్తి నియోజకవర్గం పరవాడలో ఎపిఐఐసి భూమి 116 ఎకరాల్లో పార్కు అభివృద్ధికి గుర్తించారు. యలమంచిలి నియోజకవర్గంలోని అచ్యుతాపురం మండలం పూడిమడకలో ఉప్పుపర్రకు చెందిన 124.94 ఎకరాలు, పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కపల్లి మండలం ఉపమాకలో ల్యాండ్ పార్శిల్‌లోని 50 ఎకరాలు, మాడుగుల నియోజకవర్గంలోని కె.కోటపాడు మండలం ఆర్లె, కింతాడ, గొండుపాలెం, గరుగుపాలెం, గుల్లెపల్లిలోని ప్రభుత్వ భూమి వంద ఎకరాలు, చోడవరం నియోజకవర్గంలోని చోడవరం మండలం దుద్దుపాలెంలో వంద ఎకరాలు, నర్సీపట్నం నియోజకవర్గంలోని నాతవరం మండలం శృంగవరంలో 50 ఎకరాలను ఎంఎస్‌ఎంఇ పార్కుల అభివృద్ధికి గుర్తించారు. దుద్దుపాలెంలో 2023 మే 25న వంద ఎకరాలను ఎంఎస్‌ఎంఇకు కేటాయించాలని ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలకు ఇప్పటికీ ఆమోదం లభించలేదు. కోటపాడు మండలంలోని ఆర్లె, కింతాడ, గొండుపాలెం, గురుగుపాలెం, గుల్లెపల్లిలో వంద ఎకరాల భూమిని ఎపిఐఐసికి కేటాయించాల్సివుంది. ఈ భూమిలో కొంతమంది పేదరైతులు సాగులో వున్నారు. ఎంఎస్‌ఎంఇ పార్కుల అభివృద్ధిపై బాలారిష్టాలు తొలగించకపోతే ఇదొక స్వప్నంగానే మిగలనుంది.

కోడూరులో ఎంఎస్‌ఎంఇ కోసం కేటాయించిన స్థలం

2024 -25లో రూ.71.77 కోట్ల మిగులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు 2024- 25లో రూ.71.77 కోట్ల మిగులును సాధించిందని, దానిలో చట్టపరంగా చేయవలసిన రిజర్వ్‌లను ఆయా ఖాతాలకు జమచేసి మిగిలిన మొత్తంలో రూ.43.06 కోట్లను డివిడెండ్ 12శాతంగా జమచేయగలమని విసిబి ఛైర్మన్ రాఘవేంద్రరావు తెలిపారు. మద్దిలపాలెం కాకతీయ కన్వెన్షన్ సెంటర్లో ఆదివారం జరిగిన బ్యాంకు మహాజనసభలో చలసాని రాఘవేంద్రరావు 12 శాతం డివిడెండ్ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు డిపాజిట్లలో రూ.206.64 కోట్ల పెరుగుదలతో రూ.4354.73 కోట్లకు చేరుకుని 4.98 శాతం వద్ధి సాధించిందన్నారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి రూ.71.77 కోట్లు నికర లాభం ఆర్జించిందన్నారు. ఈ ఏడాది మరో 5 బ్రాంచిలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 13న నూజివీడు బ్రాంచి ప్రారంభించనున్నామన్నారు. ఈ ఏడాది చివరకు తెనాలి, అమలాపురం, హైదరాబాద్, విశాఖపట్నంలో కొత్తగా మరో నాలుగు బ్రాంచిలను ప్రారంభించి బ్రాంచిల సంఖ్య 60కి చేర్చాలని వివరించారు. బ్యాంకు పూర్వ జనరల్‌మేనేజర్ ఏ.వి.రామకృష్ణారావు బ్యాంకుకు చేసిన సేవలకు గుర్తింపుగా పాలకవర్గం ఘనంగా సన్మానించింది. డైరెక్టర్ వి.చంద్రశేఖర్ బ్యాంకు సిఇఒగా వి.వి.బి.వరలక్ష్మి నియామకానికి ఆర్‌బిఐ నుండి ఆమోదం లభించిందని, దీనికి ఈ సభ కూడా ఆమోదం తెలపాలని తీర్మానం ప్రవేశపెట్టగా సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలియచేసింది. కార్యక్రమంలో బ్యాంకు అధ్యక్షులు చలసాని రాఘవేంద్రరావు, పూర్వ అధ్యక్షులు మానం అంజనేయులు, బ్యాంకు ఉపాధ్యక్షులు ఎమ్.రాఘవరావు, డైరక్టర్లు సూరపనేని నాగభూషణచౌదరి, ఎజె.స్టాలిన్, నామానకామరాజు, వి.చంద్రశేఖర్, జెవి.సత్యనారాయణమూర్తి, గుళ్లపల్లి జనార్ధనరావు, ఆదినారాయణశాస్త్రి, పి. వెంకట రమణారావు, కే. ప్రసాదరావు, ఉప్పలపాటి పార్వతిదేవి,సి. కోటేశ్వరరావు, పి.నారాయణ స్వామి, సి.కృష్ణమోహనరావు, ఈమని అవని, పివి నరసింహమూర్తి, చుక్కపల్లి రామారావు, ప్రొ.ఎన్. అంజయ్య, డైరెక్టర్స్ (కోఆప్టెడ్) డి. బాబురావు, రామమూర్తి వైద్యనాథన్, డిప్యూటీ సిఇఒ ఎం.వి.గణేష్‌కుమార్, జనరల్ మేనేజర్ ఎం.వి.ఎస్.ఎస్. ఎన్.శ్రీనివాస ప్రసాద్, 55 బ్రాంచిల ప్రతినిధులు, జోనల్ మేనేజర్లు, బ్రాంచి మేనేజర్లు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆంజనేయులు, చిత్రంలో రాఘవేంద్రరావు

డిఇఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

వెబ్ కౌన్సెలింగ్‌పై ఉపాధ్యాయుల నిరసన

డిఇఒ కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి - ఆరిలోవ : 'మాయాదారి వెబ్ వద్దు.. మాన్యువలే ముద్దు' అంటూ ఉపాధ్యాయులు విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని ఆదివారం ముట్టడిం చారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగింది. ఉదయం నుంచీ నిరసన నినాదాలతో డిఇఒ కార్యాలయం పరిసరాలు హోరెత్తాయి. స్టీరింగ్ కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలకు ఇచ్చిన హామీ మేరకు ఎస్‌జిటి ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సిలింగ్ మాత్రమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. వెబ్‌కౌన్సిలింగ్ ద్వారా వందలాది ఆప్షన్స్ ఎంచుకోవడం చాలా కష్టతరమని పేర్కొన్నారు. మాన్యువల్ కౌన్సిలింగ్‌లో అయితే ఆయా స్థానాలపై అవగాహనతో ఎంచుకోవడం సులభమవుతుందన్నారు. గత ప్రభుత్వం విద్యాశాఖలో ఉపాధ్యాయ సంఘాల ప్రమేయం లేకుండా పనికిమాలిన నిర్ణయాలు చేసి ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థను నాశనం చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా తమ సూచనలను, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. అనంతరం ప్రాంతీయ విద్యా సంచాలకులు (ఆర్‌జెడి) విజయ భాస్కర్‌కు, విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో్టరింగ్ కమిటీ నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు డి.గోపీనాథ్, ఇమంది పైడిరాజు, చిన్నబ్బాయి, టి.రామకృష్ణారావు, అరుణ్ కుమార్, వీరభద్రరావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

అస్త్రం యాప్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అనిత

అస్త్రం యాప్‌తో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విశాఖ నగర వాసులకు ట్రాఫిక్ సమస్యల నుంచి ఉపశమనం కల్పించాలనే ఉద్దేశంతో 'అస్త్రం' యాప్‌ను ప్రారంభించామని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఆదివారం సిపి డాక్టర్ శంఖబ్రత బాగ్చీతో కలిసి ఆమె అస్త్రం యాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు రియల్ టైమ్ ట్రాఫిక్ సమాచారం అందించడమే ఈ యాప్ ఉద్దేశమని తెలిపారు. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న వినియోగదారులు విశాఖలో ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాలను ముందుగానే తెలుసుకొని ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గమ్యస్థానానికి త్వరగా చేరుకోగలరన్నారు. అలాగే తమ పరిసరాల్లో యాక్సిడెంట్లు జరిగినా, ట్రాఫిక్ జామ్‌లు ఉన్నా, వాటిని యాప్ ద్వారా ఇతరులకు తెలియజేయవచ్చని తెలిపారు. విశాఖ వాసిగా ట్రాఫిక్ కష్టాలను తాను ప్రత్యక్షంగా చూసినట్లు అనిత తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.